క్లుప్తంగా

ఆలయంలో ప్రత్యేక పూజలు



పూజల్లో మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని తెనుగువాడలో గల ఆంజనేయ స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల్లో మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి, నాయకులు నర్సింగం, కొలిపాక నర్సయ్య, దిలీప్, సంపత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలి

కాల్వశ్రీరాంపూర్: ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ దయా అరుణ అన్నారు. మండల కేంద్రంలోని గార్డెన్స్‌లో బుధవారం నిర్వహించిన అంగన్వాడీ సెక్టార్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు, లేబర్ కార్డు, సుకన్య సమృద్ధి యోజన, సురక్ష బీమా యోజన, అటల్ పెన్షన్ యోజన, జీవన జ్యోతి యోజన, మహిళల చట్టాలు, హక్కుల గురించి వివరించారు. ఔట్ రిచ్ వర్కర్ శ్యామల, అంగన్వాడీ సూపర్‌వైజర్ సావిత్రి, టీచర్లు పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



రామగుండం: పట్టణంలోని ఏ-పవర్‌హౌస్ వద్ద బస్టాండ్‌లో తలదాచుకుంటున్న ఓ నిరుపేద కుటుంబానికి గోదావరిఖనికి చెందిన తాటిపాముల రాజామనోహర్-లావణ్య దంపతులు పెళ్లిరోజు పురస్కరించుకొని నిత్యావసర వస్తువులు అందజేశారు. గత నెల 25న సాక్షి దినపత్రికలో 'బస్ షెల్టరే నివాసం.. భవిష్యత్ అంధకారం' పేరుతో ప్రచురితమైన కథనానికి స్పందించి నిత్యావసర వస్తువులు అందజేసినట్లు దాతలు పేర్కొన్నారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై స్వామి

పాలకుర్తి: ప్రతీఒక్కరు రోడ్డు భద్రత నియమాలు పాటించాలని ఎస్సై ఆర్.స్వామి సూచించారు. బసంత్‌నగర్ సమీపంలోని కన్నాల టోల్‌ప్లాజా వద్ద ఎస్సై ఆధ్వర్యంలో బుధవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని వాహనాలకు, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిని గుర్తించి జరిమానా విధించారు. తనిఖీల్లో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

జూలపల్లి: ఉమ్మడి కరీంనగర్ జిల్లా బ్రాస్ బ్యాండ్ వర్కర్స్ యూనియన్ రెండో మహాసభలను విజయవంతం చేయాలని బ్రాస్‌బ్యాండ్ వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షుడు ఎంబీ షాబుద్దీన్ కోరారు. ఈ నెల 8న సుల్తానాబాద్‌లో నిర్వహించనున్న మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన జూలపల్లిలో ఆవిష్కరించారు. అయన మాట్లాడుతూ బ్యాండ్ వర్కర్స్ మహాసభలకు తరలి రావాలని కోరారు. నర్సింగం, కార్యదర్శి హుస్సేన్, అంజయ్య, భూమయ్య, రజవెల్లి, రఫీక్ తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గోదావరిఖనిటౌన్: 33కేవీ లైన్ మరమ్మతు పనుల కారణంగా గోదావరిఖని గౌతమినగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు గురువారం ఉదయం 9 నుంచి ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని గోదావరిఖని ఏడీఈ కె.వెంకటేశ్వర్లు తెలిపారు. గౌతమినగర్, కాశిపల్లి, ద్వారకానగర్, చంద్రశేఖర్‌నగర్, ఎలకలపల్లి, లక్ష్మీపూర్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఆయన పేర్కొన్నారు.

నియామకం

పెద్దపల్లిరూరల్: పట్టణంలోని కమాన్ ప్రాంతానికి చెందిన బొంకూరి సుభాష్ ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా కమిటీ సభ్యుడిగా నియమితులైనట్లు జిల్లా అధ్యక్షుడు లంక సదయ్య ఉత్తర్వులిచ్చారు.

ఏడేళ్లుగా ప్రజాపాలనకు దూరం

- సమస్యల వలయంలో కేకేనగర్ వాసులు
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పించాలని వినతి
- దృష్టిసారించని సింగరేణి యాజమాన్యం, ప్రజాప్రతినిధులు, అధికారులు



శిథిలావస్థకు చేరుతున్న ఇళ్లు



కేకేనగర్ గ్రామం

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి ప్రభావిత గ్రామం వెంకట్రావుపల్లి గ్రామ పంచాయతీ పరిధి కేకేనగర్ గ్రామంలోని ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామానికి 500మీటర్ల దూరంలో ఆర్జీ-2ఏరియా ఓసీపీ-3 ఉండడంతో ఓసీపీ-3లో జరుగుతున్న బ్లాస్టింగులతో దుమ్ము, ధూళి ఇళ్లను కమ్మేస్తోంది. బ్లాస్టింగులతో కొన్ని ఇంటి గోడలు కూలిపోయిన ఘటనలు ఉన్నాయి. 2010లో ఓసీపీ-3 విస్తరణ కోసం ఆర్జీ-2 సింగరేణి యజమాన్యం గ్రామాన్ని తీసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ప్రజలు వాపోతున్నారు. గ్రామంలో సరైన మరుగుదొడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, సైడ్ డ్రైనేజీలు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో లోతట్టు ప్రాంతాల ఇళ్లలోకి వర్షం నీరు, బురద నీటితో పాటు విష పురుగులు వస్తుండడంతో ప్రజలు భయందోళనకు గురవుతున్నారు. గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీతో పాటు పునరావాసం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేషన్‌లో విలీనం చేయొద్దు..

గతంలో 2018లో గ్రామ పంచాయతీ ఎన్నికల సమయంలో వెంకట్రావుపల్లి గ్రామాన్ని కార్పొరేషన్‌లో విలీనం చేశారు. ప్రజల ఒత్తిడితో తిరిగి 2019లో గ్రామపంచాయతీలో కలిపారు. అప్పుడు కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించారు. కానీ గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తి కావడంతో 2018 నుంచి ఏడేళ్ల పాటు ప్రజాపాలనకు దూరమైంది. అభివృద్ధి లేక ప్రజలకు రావాల్సిన సంక్షేమ పథకాలు సరిగా రాక గ్రామ పంచాయతీ నిధులు ఉపయోగించుకోక పోవడంతో గ్రామం వెనుకబడింది. ప్రస్తుతం మంత్రి శ్రీధర్‌బాబు కార్పొరేషన్‌లో విలీనం చేస్తున్నట్లు ప్రకటించడంతో ప్రజలు అయోమయంలో పడ్డారు. గ్రామంలోని నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో వారిలో కొంతమంది నాయకులు పంచాయతీలోనే ఉండాలని కోరుతున్నారు. మరికొందరు కార్పొరేషన్ కావాలని డిమాండ్ చేస్తున్నారు. తమ సమస్యలు పట్టించుకునే నాయకులు లేకుండా పోయారని ప్రజలు వాపోతున్నారు.

గ్రామాన్ని తరలించాలి



గత కొన్నేళ్లుగా ఓసీపీ-3లో జరిగే బ్లాస్టింగులతో వచ్చే దుమ్ముతో భరించలేకపోతున్నాం. శ్వాస కోశకు సంబంధించిన వ్యాధులతో బాధపడుతూ అనేక మంది వివిధ రోగాల బారిన పడుతున్నారు. మా గ్రామాన్ని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలి.

– జిల్లా ఓదెలు, కేకేనగర్

మా బాధలు వినేవారు లేరు



గ్రామంలోని అనేక సమస్యలు పరిష్కరించడంపై అధికారులు దృష్టిసారించాలి. మా బాధలు వినే నాయకులు ఎవరూ లేరు. సింగరేణి అధికారులు స్పందించి మా గ్రామాన్ని వేరే ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలి.

– ఆవుల రాజమ్మ, కేకేనగర్

విధుల్లో ప్రతిభ కనబరచాలి



అభినందిస్తున్న సీపీ అంబర్ కిషోర్‌ఝా

గోదావరిఖని: విధుల్లో ప్రతిభ కనబర్చి మరిన్ని పదోన్నతులు సాధించాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. పోలీస్ కమిషనరేట్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి సాధించిన 51మంది కానిస్టేబుళ్లను ఆయన అభినందించారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ సి.రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏవో శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్, సూపరింటెండెంట్ సందీప్, మనోజ్‌కుమార్ పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యంపై నిషేధాజ్ఞలు

రామగుండం కమిషనరేట్ పరిధిలో మంచిర్యాల, పెద్దపల్లి జోన్లలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను నెల పాటు పొడిగిస్తున్నామని సీపీ అంబర్‌కిషోర్‌ఝా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మే ఒకటో తేదీ వరకు ఈ నిషేధాజ్ఞలు కొనసాగుతాయన్నారు.

సిటీ పోలీస్‌యాక్ట్ అమలు

రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో సిటీ పోలీస్‌యాక్ట్ అమలులో ఉంటుందని సీపీ పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో ఎలాంటి ధర్నాలు, ర్యాలీలు, రాస్తారోకోలు, సభలు, సమావేశాలు నిర్వహించకూడదని, నిర్వహణకు ముందుగా పోలీసు అధికారుల అనుమతి తీసుకోవాలని సూచించారు.

భూములు కబ్జాచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి



ధర్నాలో కాకర్లపల్లి వాసులు, నాయకులు

మంథని: మండలంలోని రెడ్డిచెరువును ఆనుకొని ఉన్న భూములను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకొని, కాకర్లపల్లి ఎస్సీ సామాజికవర్గ ప్రజలకు పట్టాలు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బూడిద గణేశ్ కోరారు. మంథనిలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట బుధవారం ఆయన కాకర్లపల్లి వాసులతో కలిసి ధర్నా నిర్వహించారు. గతంలో భూసీలింగ్ యాక్టు ప్రకారం ఎస్సీలకు భూములు కేటాయించారని, పట్టాలు ఇవ్వలేదన్నారు. పట్టాలు ఇవ్వాలని అనేక మార్లు కోరినా అధికారులు, పాలకులు పట్టించుకోలేదన్నారు. కాగా అట్టి భూములపై కన్నేసిన కొందరు కబ్జా చేశారని ఆరోపించారు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకొని విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కాకర్లపల్లి వాసులకు పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో సురేశ్‌కు వినతిపత్రం అందించారు. ఆకుల శ్రీనివాస్, కన్నెబోయిన కొమురయ్య, ఓదెలు, మెండె రాజయ్య, రాంచందర్, రమేశ్, సమ్మయ్య, శంకర్, సది, రాజేందర్, శేఖర్, లక్ష్మి, స్వరూప ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• ప్రశ్నించినందుకు దాడులు చేస్తారా

పెద్దపల్లిరూరల్: అవినీతి, అక్రమాల గురించి ప్రశ్నిస్తే దాడులకు పాల్పడడం ఏంటని సీపీఎం రాష్ట్ర నాయకుడు భూపాల్ ప్రశ్నించారు. పెద్దపల్లి మండలం సీపీఎం కార్యదర్శి కల్లెపల్లి అశోక్‌పై ఇటీవల జరిగిన దాడిలో గాయపడ్డాడు. కాగా మండలంలోని రాఘవాపూర్‌లో బుధవారం ఆయనను కలిసి పరామర్శించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా కార్యదర్శి ముత్యంరావు, నాయకులు శ్రావణ్, అంజి, నవీన్ ఉన్నారు.

• పోటీ పరీక్షలపై అవగాహన

గోదావరిఖనిటౌన్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదివి 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులకు గోదావరిఖని ట్రాఫిక్ సీఐ రాజేశ్వరరావు, ఎస్సై హరిశేఖర్ సెలవు రోజుల్లో విద్యార్థులు వివిధ పోటీ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలనే అంశంపై అవగాహన కల్పించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సమీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

• ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

రామగుండం: నక్సల్స్ అణిచివేత పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని ఏప్రిల్ 8న హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగే ప్రజాధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు మేర్గు చంద్రయ్య కోరారు. రామగుండం పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలో బుధవారం ప్రజాధర్నా పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. న్యూడెమోక్రసీ నాయకులు మల్లేశ్, రమేశ్, దేవయ్య, ఆనంద్, తిరుపతి, జంపయ్య, ప్రశాంత్, ప్రభాకర్‌కుమార్ ఉన్నారు.

• పరీక్ష కేంద్రంలో విద్యార్థికి గాయాలు

ఓదెల: ఓదెల మోడల్‌స్కూల్ పరీక్ష కేంద్రంలో పదో తరగతి పరీక్ష రాస్తున్న నాంసానిపల్లెకు చెందిన హిందు అనే విద్యార్థినికి గాయాలయ్యాయి. సాంఘికశాస్త్రం పరీక్ష రాయడం కోసం బుధవారం గదిలోకి వెళ్లగా అకస్మాత్తుగా తలుపు తలకు తగలడంతో తీవ్రగాయమైంది. వెంటనే సమాచారం తెలుసుకున్న స్థానిక ఆర్‌ఎంపీ డాక్టర్ ఇప్పలపల్లి వెంకటేశ్వర్లు ప్రాథమిక చికిత్స చేశారు. విద్యార్థికి ఎలాంటి ప్రమాదం లేదని తెలియడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు ఊపిరిపీల్చుకున్నారు.

• మందకృష్ణ మాదిగకు సన్మానం

యైటింక్లయిన్‌కాలనీ: ఎస్సీ వర్గీకరణ కోసం కృషి చేసిన ఎమ్మార్పీఎఫ్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగను సింగరేణి మాదిగ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బుధవారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సొప్పదండి దుర్గాప్రసాద్, రాజేశ్వరరావు, మోహన్, శ్రావణ్‌కుమార్, చంద్రమౌళి, కృష్ణ పాల్గొన్నారు.

• పందుల దొంగతనం

సుల్తానాబాద్‌రూరల్: పట్టణంలోని శాస్త్రీనగర్‌కు చెందిన మానుపాటి ఈరయ్యకు చెందిన 32 పందులను మంగళవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు ఎత్తుకెళ్లారు. రైస్‌మిల్ అసోసియేషన్ సమీపంలోని పందుల షెడ్డులోంచి దాదాపు రూ.2లక్షల విలువ గల 32 పందులు ఎత్తుకెళ్లగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

• అంతర్గాంలో విషాదఛాయలు

రామగుండం: అంతర్గాం మండలంలోని విలేజీ అంతర్గాంకు చెందిన అందె విజయ్ బుధవారం వేకువజామున హైదరాబాద్ రింగ్ రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందాడు. విజయ్ మరణవార్త తెలిసిన వెంటనే స్వగ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. పీవైఎల్, ఇతరత్రా విప్లవ పార్టీల శ్రేణులు జోహార్లు అర్పించారు. విజయ్ అంత్యక్రియలు శుక్రవారం మంచిర్యాలలో నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు పేర్కొన్నారు.

• తాటిచెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్రగాయాలు

ధర్మారం: మండలంలోని రామయ్యపల్లికి చెందిన పల్లె తిరుపతి (45) కల్లుగీసేందుకు బుధవారం తాటిచెట్టు ఎక్కుతుండగా జారిపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నేడు టీబీజీకేఎస్ సెంట్రల్ కమిటీ సమావేశం

గోదావరిఖని: తెలంగాణ బొగ్గుగని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) కేంద్ర కార్యవర్గ సమావేశం గురువారం స్థానిక సిరి ఫంక్షన్‌హాల్‌లో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, కేంద్ర అధికార ప్రతినిధి పర్లపల్లి రవి ఒక ప్రకటనలో తెలిపారు. సింగరేణిలోని 11 డివిజన్ల నుంచి యూనియన్ ప్రతినిధులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

రేపు గోదావరిఖనిలో బీజేపీ సమావేశం

పెద్దపల్లిరూరల్: జిల్లాలోని గోదావరిఖనిలో శుక్రవారం బీజేపీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి ప్రదీప్‌కుమార్, రఘునాథరావు హాజరై అంబేడ్కర్ జయంతి వేడుకల నిర్వహణ తీరుపై దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. సమావేశానికి మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ ముఖ్య నాయకులు గోదావరిఖని శారదానగర్‌లోని శ్రీసరస్వతి శిశుమందిర్‌లో జరిగే సమావేశానికి హాజరు కావాలని కోరారు.

రూ.10 పెన్షన్ ఫండ్ ఇచ్చేందుకు అంగీకారం

గోదావరిఖని: బొగ్గుగని కార్మికుల సీఎంపీఎఫ్ ఫండ్‌కు టన్నుకు మరో రూ.10చొప్పున ఇచ్చేందుకు కోల్ కంపెనీలు అంగీకరించినట్లు సీఐటీయూ ప్రధాన కార్యదర్శి, వేజ్‌బోర్డు మెంబర్ మంద నర్సింహారావు తెలిపారు. చాలాకాలంగా పెన్షన్ నిధి స్థిరత్వం గురించి ఆందోళనలు తలెత్తుతున్నాయన్నారు. ఫిబ్రవరి 2024లో జరిగిన బీటీటీ సమావేశం, జూన్ 2024లో బొగ్గు మంత్రిత్వశాఖ అదనపు కార్యదర్శి అధ్యక్షతన ఒక కమిటీ ఏర్పడింది. దీనిలో యూనియన్ల తరఫున సీఐటీయూ బీవోటీ రామానందన్‌ను చేర్చారన్నారు. కమిటీ మొదటి సమావేశం జూలై 2024లో జరిగిందని, దీనిపై ఏకాభిప్రాయం కుదిరిందని, గతంలో ఇచ్చే పది రూపాయలకు అదనంగా మరో రూ.10 ఇవ్వడానికి ఆమోదం జరిగిందన్నారు. ఈనెల 16నుండి అమలులో వస్తుందని పేర్కొన్నారు.

17వ డివిజన్‌లో అంగన్వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ 17వ డివిజన్ ఏరియాకు అంగన్వాడీ సెంటర్ కావాలని బుధవారం స్థానిక నాయకులు ధీరజ్ కలెక్టర్, డీడబ్ల్యూవో వేణుగోపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో 17వ డివిజన్ సంతోష్ నగర్ ఏరియాలో అంగన్వాడీ సెంటర్ ఉండేదని, 4ఏళ్ల క్రితం తొలగించడంతో గర్భిణుల, చిన్నపిల్లలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ఎమ్మెల్యే చొరవతో 17వ డివిజన్ ఏరియాకు తిరగి ప్రత్యేక అంగన్వాడీ సెంటర్ ఏర్పాటు చేయాలని విన్నవించారు. స్పందించిన అధికారులు వెంటనే సెంటర్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్నట్లు నాయకులు తెలిపారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

సాక్షి ఎఫెక్ట్..



గుంతలు పూడ్చివేయిస్తున్న ఎస్సై ప్రసాద్

కమాన్‌పూర్: మండలంలోని పేరపల్లి నుంచి రొంపికుంట వెళ్లే రహదారిపై ఏర్పడిన గుంతలను బుధవారం కమాన్‌పూర్ ఎస్సై కొట్టె ప్రసాద్ జేసీబీ సాయంతో పూడ్చివేయించారు. రహదారిపై ఏర్పడిన గుంతలతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని సాక్షి దినపత్రికలో ఇటీవల కథనం ప్రచురితమైంది. ఎస్సై స్పందించి గుంతలను పూడ్చివేయించారు.

సింగరేణి వార్తలు

సమష్టి కృషితో ఉత్పత్తి లక్ష్యం సాధించాం



మాట్లాడుతున్న జీఎం సుధాకర్‌రావు

గోదావరిఖని: సమష్టి కృషితో ఏరియాకు నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించామని ఆర్జీ-3 జీఎం సుధాకర్‌రావు అన్నారు. ఓసీపీ-1 సైటాఫీస్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గతేడాది ఏరియాలో 62.50లక్షల టన్నుల లక్ష్యానికిగాను 104శాతంతో 65.11లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. ఓసీపీ-1 గనికి నిర్దేశించిన 35లక్షల టన్నుల లక్ష్యానికి 35.01 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించడంలో ప్రతీఒక్కరి కృషి అభినందనీయని కొనియాడారు. రానున్న రోజుల్లో ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి సంస్థ లక్ష్యాల సాధనలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించేందుకు కృషి చేయాలని జీఎం పిలుపునిచ్చారు. సమావేశంలో యూనియన్ నాయకులు రాంచంద్రారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి, ప్రాజెక్టు అధికారి రాజశేఖర్, ఇంజినీర్ ఉదయ భాస్కర్, ఇన్‌చార్జి మేనేజర్ కోటయ్య, పిట్ సెక్రటరీలు డి.తిరుపతిరావు, వెంకటస్వామి, ఇతర అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకానికి ప్రత్యేక కౌంటర్



దరఖాస్తు సమర్పించడానికి వచ్చిన నగర ప్రజలు

కోల్‌సిటీ: రాజీవ్ యువవికాసం పథకం దరఖాస్తులు స్వీకరించడానికి రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలోని మెప్మా విభాగంలో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ కోయ శ్రీహర్ష, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, కమిషనర్ జె.అరుణశ్రీ తెలిపారు. ఈ నెల 14 వరకు దరఖాస్తు చేసుకోవడానికి గడువు ఉందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించి ఆ పత్రాలను నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కౌంటర్‌లో అందజేయాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోలేని వారు దరఖాస్తు పూరించి ఆధార్, రేషన్ కార్డు/తాజా ఆదాయ ధృవీకరణ పత్రం, రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డ తర్వాత జారీ చేసిన కుల ధృవీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో జత చేసి నేరుగా అందిస్తే, నగరపాలక సంస్థ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి 21 నుంచి 55ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులు కాగా వ్యవసాయ యూనిట్లు స్థాపించుకునే వారికి 60ఏళ్ల వరకు అవకాశం ఉందని తెలిపారు. నగరపాలక సంస్థ పరిధిలో దరఖాస్తు చేసుకునేవారి కుటుంబ వార్షిక ఆదాయం రూ.2లక్షలలోపు ఉండాలని, రూ.50 వేలలోపు యూనిట్లకు వందశాతం, రూ.లక్షలోపు యూనిట్లకు 90శాతం, రూ.2లక్షలలోపు యూనిట్లకు 80శాతం, రూ.4లక్షలలోపు యూనిట్లకు 70శాతం సబ్సిడీ ఉంటుందని వివరించారు.

సర్వాయి పాపన్న ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తాం



మంథని: నివాళి అర్పిస్తున్న పుట్ట మధు

మంథని: సర్దార్ సర్వాయి పాపన్న ఉద్యమ స్ఫూర్తిని నియోజకవర్గంలో కొనసాగిస్తానని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు అన్నారు. పాపన్న వర్ధంతి సందర్భంగా మంథని పట్టణంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. నాయకులు ఏగోళపు శంకర్‌గౌడ్, తగరం శంకర్‌లాల్, ఆరెపల్లి కుమార్, రాజుగౌడ్, కనవేన శ్రీనివాస్ ఉన్నారు.

ఓదెలలో పాపన్న విగ్రహానికి నివాళి

ఓదెల: ఓదెల గ్రామంలో గీత పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో సర్వాయి పాపన్న వర్ధంతి బుధవారం నిర్వహించారు. సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్, గౌడసంఘం నాయకులు నాగపురి రవి, పచ్చిమట్ల శ్రీనివాస్‌గౌడ్, ఆయా పార్టీల నాయకులు పాల్గొన్నారు.

కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయం



మాట్లాడుతున్న రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్

గోదావరిఖని: కార్మికవర్గ రాజ్యాన్ని స్థాపించడమే ధ్యేయంగా సీఐటీయూ ముందుకు సాగుతుందని రాష్ట్ర ఉపాధ్యక్షుడు భూపాల్ పేర్కొన్నారు. స్థానిక శ్రామికభవన్‌లో బుధవారం జిల్లాస్థాయి విస్తృత సమావేశం నిర్వహించారు. సమాజంలో అన్నిరకాల దోపిడీ, అణిచివేత, వివక్షలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. శ్రామిక వర్గాన్ని విముక్తి చేసి, పెట్టుబడిదారీ సమాజానికి ప్రత్యామ్నాయంగా కార్మిక వర్గ రాజ్యాన్ని స్థాపించాలనే లక్ష్యంతో ముందుకెళ్తున్నామన్నారు. ఈనెల 6న కార్మిక ఉద్యమ నేత సీఐటీయూ వ్యవస్థాపక అధ్యక్షుడు బీటీ రణదివే వర్ధంతి నుంచి ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి వరకు సామాజిక న్యాయం సాధన క్యాంపెయిన్ చేయాలని పిలుపునిచ్చారు. క్యాంపెయిన్ సందర్భంగా ×సమకాలీన పరిస్థితుల్లో భారత రాజ్యాంగం–అంబేడ్కర్–కార్మిక వర్గ కర్తవ్యం అనే అంశంపై సదస్సులు, సెమినార్లు జిల్లా, పట్టణ, మండల కేంద్రాల్లో నిర్వహించాలని కోరారు. ఏప్రిల్ 13న జిల్లా కేంద్రాల్లో సామాజిక న్యాయ సాధన బైక్ ర్యాలీలు నిర్వహించాలని, ఏప్రిల్ 14న యూనియన్ అనుబంధ సంఘాలన్నీ అంబేడ్కర్ జయంతిని నిర్వహించాలని పిలుపునిచ్చారు. మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెలో జిల్లాలోని అన్ని రంగాల కార్మికులు, ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేయాలన్నారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, నాయకులు ఎరవెల్లి ముత్యంరావు, వేల్పుల కుమారస్వామి, మెండె శ్రీనివాస్, ఎస్.బిక్షపతి, జి.జ్యోతి, ఎం.రామాచారి, కొమరయ్య, సీపెల్లి రవీందర్, తాండ్ర అంజయ్య, చిప్పకుర్తి అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూలో భూముల వేలం ఆపాలి

గోదావరిఖని: హైదరాబాద్‌లోని హెచ్‌సీయూ భూముల వేలాన్ని నిలిపివేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు భూపాల్ డిమాండ్ చేశారు. స్థానిక ప్రధాన చౌరస్తాలో బుధవారం వారు నిరసన తెలిపారు. ఈ విధానాన్ని విరమించుకోవాలని, లేకుంటే భవిష్యత్‌లో ఆందోళనలు ఉధృతం చేస్తామని పేర్కొన్నారు. నాయకులు వేల్పుల కుమారస్వామి, రామాచారి, సారయ్య, బిక్షపతి, గణేశ్, ఎస్.రవీందర్, తుమ్మల రాజారెడ్డి పాల్గొన్నారు.

ఇల్లు కూల్చి వృద్ధ దంపతులను రోడ్డున పడేస్తారా..

పెద్దపల్లిరూరల్: ఉగాది పండుగ రోజున దేవరకొండ సత్యనారాయణ అనే వృద్ధ దంపతుల ఇంటి నుంచి సామగ్రి రోడ్డున పడేసి ఇంటిని కూల్చేయడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే గుజ్జుల రామకృష్ణారెడ్డి అన్నారు. పెద్దపల్లిలో బుధవారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కర్రె సంజీవరెడ్డి, కన్నం అంజయ్యతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీనిపై రామగుండం సీపీ విచారణ జరిపించాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు జోక్యం చేసుకుని ఈ ఘటనలో బాధితులకు న్యాయం చేయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు పల్లె సదానందం, పర్శ సమ్మయ్య, శ్రీనివాసరావు, ఓదెలు, బెజ్జంకి దిలీప్‌కుమార్, శివంగారి సతీశ్, రమేశ్, మహేందర్, సంతోష్, మనోహర్, రాజవీరు, అన్వేష్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధిని అడ్డుకోవాలనుకోవడం సరికాదు

మంథని: నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా మంథని వద్ద గోదావరిపై రూ.125కోట్లతో మంచిర్యాల జిల్లా శివ్వారం వరకు వంతెన నిర్మాణం చేపడితే నిరుపయోగమంటూ మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు మట్లాడటం సరికాదని స్థానిక కాంగ్రెస్ నాయకులు అన్నారు. మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం వారు విలేకరులతో మాట్లాడారు. వంతెన నిర్మాణం జరిగితే రాకపోకలు పెరిగి మంథనిలో వ్యాపార, వాణిజ్యం మెరుగుపడుతుందన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, ప్రచార కమిటీ అధ్యక్షుడు వొడ్నాల శ్రీనివాస్, ఎస్సీ సెల్ డివిజన్ అధ్యక్షుడు మంథని సత్యం, మంథని సురేశ్, సాదుల శ్రీకాంత్, కుడుదుల వెంకన్న, గోటికార్ కిషన్, ఎరుకల ప్రవీణ్, బూడిద శంకర్, అజీం ఖాన్, శంకర్, సంపత్, సతీశ్, లింగయ్య ఉన్నారు.